చేవెళ్ల గడ్డ.. కాంగ్రెస్ అడ్డా..

- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం
- మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్

మొయినాబాద్: చేవెళ్ల గడ్డ.. కాంగ్రెస్ అడ్డా.. ఇక్కడి నుంచే కాంగ్రెస్‌కు పూర్వ వైభవం రాబోతోంది. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని పద్మావతి గార్డెన్‌లో బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం మండల పార్టీ అధ్యక్షుడు మాణయ్య అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం.. దేశంలో మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలంతా విసిగిపోయి ఉన్నారని.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. కాంగ్రెస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. హాత్‌సే హాత్ జోడో, పల్లె బాట కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ చేస్తానన్న సీఎం కేసీఆర్ ఊరూరికి మందు షాపులు, బెల్టు షాపులు పెట్టి తాగుబోతు తెలంగాణ చేశారన్నారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, నిత్యావసర సరుకుల ధరలు పెంచి మోదీ ప్రభుత్వం ప్రజలపై



అభివాదం చేస్తున్న ప్రసాద్‌కుమార్, నర్సింహారెడ్డి తదితరులు

పెనుభారం వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ సంపదనంతా అదానీ. అంబానీలకు కట్టబెడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తుందని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో చేవెళ్ల టికెట్ ఎవరికొచ్చినా పార్టీకోసం పనిచేసి గెలిపించాలని.. రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడానికి సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహ్మారెడ్డి, మాజీ అధ్యక్షుడు వెంకటస్వామి, టీపీసీసీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, సమన్వయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షాబాద్ దర్శన్, టీపీసీసీ సభ్యుడు భీంభరత్, సీనియర్ నాయకులు వసంతం, జనార్దన్‌రెడ్డి, సతీష్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షుడు మల్లారెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం అధ్యక్షుడు పెంటారెడ్డి, సర్పంచ్ ప్రవీణ్, ఎంపీటీసీ రాంరెడ్డి పాల్గొన్నారు.

మా పథకాలు దేశానికి ఆదర్శం

ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్: సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్తు కార్యాలయంలో ముస్లింలకు రంజాన్ కానుకలను జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి, ఎంపీపీ ప్రశాంతిరెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని, రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సముచిత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రంజాన్ కిట్లు, క్రిస్మస్ కానుకలు, బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తోందని ఆనందం వ్యక్తం చేశారు. మైనార్టీల విద్యాభివృద్ధికి ప్రత్యేక రెసిడెన్షియల్ స్కూళ్లు, గురుకులాలు ఏర్పాటు చేస్తోందన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఎంఏ మతిన్, తహసీల్దార్ సైదులుగౌడ్, ఎంపీడీఓ అనురాధ, రైతు సంఘం జిల్లా కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యులు చాంద్‌పాషా, మాజీ కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ ఆయాబ్, మైనార్టీ నాయకులు ముఖ్రంఖాన్, ఇమ్రాన్, అరీఫ్, సర్పంచ్‌లు శ్రీధర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, స్వరూప నర్సింహులు తదితరులున్నారు.



కానుకలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, అవినాశ్‌రెడ్డి, ఎంపీపీ

ఒత్తిడిని అధిగమించడమే ధ్యానం

ధ్యాన ప్రచార కార్యదర్శి ఆంజనేయరెడ్డి, లావణ్య



అవగాహన కల్పిస్తున్న లావణ్య

షాబాద్: శ్వాస మీద ధ్యాస పెట్టి గమనిస్తూ ఉండడమే ధ్యానం అని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయరెడ్డి, జ్ఞాన ప్రచారకర్త లావణ్య అన్నారు. బుధవారం మండలంలోని కొమరబండ, గొల్లూరు గూడ, ముద్దెంగూడ, కేశవగూడ, చర్లగూడ గ్రామాల్లో ప్రజలకు ధ్యానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ధ్యానం చేస్తేనే శ్వాస యొక్క రహస్యం బట్టబయలు అవుతుందన్నారు. శ్వాసను ప్రతినిత్యం ఒక గంట సేపు గమనించడం ద్వారా ఎటువంటి ఆలోచనలు లేకుండా మౌనంగా శూన్యస్థితిలో ఉంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. నిత్యజీవితంలో ఎదుర్కొనే అనేక ఒత్తిడిలను ధ్యానంతో అధిగమించవచ్చన్నారు. కార్యక్రమంలో పిరమిడ్ సంస్థ సభ్యులు బాలకృష్ణారెడ్డి, శ్రీనివాస్, యాదయ్య, వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మి, శైలజ, శ్రీలత, సుభద్ర స్వప్న, కృష్ణమద్దిలేటి, రాంచంద్రయ్య, విజయ్‌కుమార్ తదితరులున్నారు.

న్యాయవాదులపై దాడులు హేయం



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

బార్ అసోసియేషన్ సభ్యులు

చేవెళ్ల: న్యాయవాదులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని చేవెళ్ల కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, బి. యాదిరెడ్డిలు డిమాండ్ చేశారు. రాజేంద్రనగర్‌లో న్యాయవాదిపై జరిగిన దాడికి నిరసనగా బుధవారం న్యాయవాదులు నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. న్యాయం కోసం ప్రజల తరపున పోరాడే తమపై దాడులు చేయడం హేయమైన చర్య అని అన్నారు. న్యాయవ్యవస్థపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని దూరం చేసే ప్రయత్నం జరుగుతుందన్నారు. న్యాయవాదులపై దాడులకు పాల్పడే వ్యక్తులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ నిరసనలో అసోసియేషన్ సభ్యులు కార్యదర్శి చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి మల్లేశ్, కోశాధికారి శ్రీనివాస్, లైబ్రేరియన్ యాదగిరి, సీనియర్ న్యాయవాదులు బాలస్వామి, రాఘవేందర్‌రెడ్డి, పాండురంగారెడ్డి, శంషోద్దీన్, సత్యానందం, రవీందర్‌రెడ్డి, మల్లేశ్‌యాదవ్, ఈశ్వర్, కుమార్, సుదర్శన్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి చేయూత

తలకొండపల్లి: నిరుపేదల ఇంటి నిర్మాణాలకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనందిస్తున్నాడు. మండల పరిధిలోని చంద్రధనకు చెందిన రాములమ్మ ఇంటి నిర్మాణానికి బుధవారం ట్రస్టు సభ్యులచే ఇసుక, స్టీల్, ఇటుక, సిమెంట్ తదితర మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్‌లు సుధాకర్, మోహన్‌రెడ్డి, అశోక్, క్రిష్ణ, ఇమ్రాన్ పాల్గొన్నారు.

టీడీపీ నేతల ఇంటింటి ప్రచారం

కడ్తాల్: టీడీపీ తెలంగాణ శాఖ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ఆదేశానుసారం మండల పరిధిలోని ఎక్వాయిపల్లి, ముద్విన్, చరికొండ గ్రామాల్లో బుధవారం ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ యాదిలాల్ కరపత్రాల ద్వారా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం పాలనలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి ఇంటింటికి తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు.. పాండు, జంగయ్య వీరయ్య, సత్యం, జంగయ్య, రహీమ్, శివ, శ్రీనాథ్, మహేందర్, వెంకన్న, ఈశ్వర్, ప్రేమ్‌రాజ్, చంద్రశేఖర్‌గౌడ్, నర్సింహ, వెంకట్ తదితరులు ఉన్నారు.

ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించండి

చేవెళ్ల: ఐకేపీ వీఓఏల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఏపీఎం శోభారాణికి ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం సభ్యులు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం, సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సమ్మె నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. గత 19 ఏళ్లుగా గ్రామాల్లో మహిళల అభ్యున్నతికి మహిళా స్వయం సహాయక సంఘాలు పని చేస్తున్నాయని తెలిపారు. మహిళలు ఆర్థికంగా సామాజికంగా ఎదగడానికి చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునేలా ప్రోత్సహిస్తూ, వారికి లోన్స్ ఇప్పించి వాటిని తిరిగి చెల్లించే విధంగా విధులను వీఓఏలు నిర్వహిస్తున్నారని చెప్పారు. డ్వాక్రా సంఘాలు నిర్వహిస్తున్న లావాదేవీలన్నీ పుస్తక నిర్వహణ చూస్తూ, ఎస్‌హెచ్‌జీ లైవ్ మీటింగ్‌లు పెట్టి అన్ని సంఘాలు ఆన్‌లైన్‌లో ఎంట్రీలు చేసే పనులు వీరు చేస్తుంటారన్నారు. వీటితో పాటుగా ప్రభుత్వం చేపడుతున్న అన్ని రకాల సంక్షేమ పథకాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రం వచ్చి 8 ఏళ్లు దాటిన వీఓఏల బతుకులు మారడం లేదన్నారు. వీఓఏలకు కేవలం 3900 గౌరవ వేతనం మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. చాలీచాలని ఈ జీతంతో కుటుంబాలు గడవడం లేదని ప్రభుత్వం వీరి జీతాలు పెంచాలని ఉద్యోగ భద్రత కల్పించాలని కోరడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వీఓఏలు పాల్గొన్నారు.



శోభారాణికి సమ్మె నోటీస్ అందిస్తున్న నాయకులు

ఆరోగ్యంపై మహిళలు జాగ్రత్తలు తీసుకోవాలి

- సంపూర్ణ పోషక ఆహార నిపుణులు శ్రీదేవిజాస్వీ
- పోషకాహారంపై మహిళలకు అవగాహన

మొయినాబాద్‌రూరల్: మహిళలు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సంపూర్ణ పోషకాహార నిపుణురాలు శ్రీదేవిజాస్వీ అన్నారు. మండలంలోని నక్కలపల్లిలో సర్పంచ్ స్వప్న ఆధ్వర్యంలో నేషనల్ డెమోక్రటిక్ సంఘం అధ్యక్షురాలు బ్రహ్మచారి చైతన్య అధ్యక్షతన పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ఆహారం పట్ల పలు సూచనలు, సలహాలు అందజేశారు. పోషకాహారం తీసుకున్నప్పుడే మహిళలు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ.. అవగాహన సదస్సులో పాల్గొన్న సినీ హీరోయిన్ ఎల్నాజ్‌నోరౌజిని మహిళ ఆరోగ్యం పట్ల సూచనలు, సలహాలు ఇవ్వడాన్ని అభినందించారు. ప్రజాస్వామ్యంలో సంక్షోభాన్ని పరిష్కరించడానికి బ్రహ్మచారి చైతన్య స్థాపించిన డెమోక్రటిక్ సంఘం మానవ జీవన నాణ్యతను మెరుగుపరచాలని ధృఢసంకల్పంతో పని చేస్తుందని ఆమె పేర్కొన్నారు. అనంతరం సర్పంచ్ స్వప్న నేషనల్ డెమోక్రటిక్ సంఘం వారికి కృతజ్ఞతలు తెలిపారు.



మహిళలకు అవగాహన కల్పిస్తున్న చైతన్య, సినీ హీరోయిన్ ఎల్నాజ్‌నోరౌజిని

యాచారంలో డంపింగ్‌యార్డు రానివ్వను

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: యాచారం మండలంలో డంపింగ్‌యార్డు రానివ్వనని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరం నుంచి సేకరించిన చెత్తకు సంబంధించి యాచారంలో డంపింగ్‌యార్డు ఏర్పాటు చేస్తామని ప్రతిపక్ష నేతలు ప్రచారం చేస్తున్న మాటలు అవాస్తవమన్నారు. యాచారం మండలానికి ఎట్టి పరిస్థితుల్లో డంపింగ్‌యార్డు రానివ్వనని హామీ ఇచ్చారు. ఓంకారేశ్వర ఆలయ భూములు ఫార్మాకు ఇస్తున్నారనే విషయంపై ప్రభుత్వం స్పష్టంగా ఉందన్నారు. రైతుల నుంచి ఆ భూములు తీసుకునేది లేదన్నారు. అవసరమైతే ఆ భూముల్లో ఐటీ కంపెనీలు ఏర్పాటు చేసి యాచారం మండల ప్రజలకు ఉపాధి కల్పిస్తామని తెలిపారు. ఫార్మాసిటీ ఏర్పాటుతో బఫర్ పంచాయతీ కొత్తగా వస్తుందని దానితో ప్రజలకు ఇబ్బంది లేదన్నారు. మైనింగ్ జోన్ వస్తుందని ప్రతిపక్ష పార్టీలు ప్రచారం చేస్తున్నాయని మైనింగ్ జోన్‌కు తాను వ్యతిరేకమని.. ఎప్పటికి రానివ్వనని స్పష్టం చేశారు. ప్రజలు అయోమయానికి గురికావాల్సిన అవసరం లేదన్నారు.

రేపు గోదాం నిర్మాణ పనులకు శంకుస్థాపన

పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి

తలకొండపల్లి: మండల కేంద్రంలో ఈనెల 21న ఉదయం 12గంటలకు పీఏసీఎస్ గోదాం నిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రూ.76 లక్షల నాబార్డ్ నిధులతో 1000 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ సామర్థ్యం గల సింగిల్‌విండో గోదాంను నిర్మించనున్నట్లు చెప్పారు. అనంతరం వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు. అదేవిధంగా మండల పరిధిలోని పడకల్‌లో ఉదయం 11 గంటలకు పొద్దుతిరుగుడు, వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవ కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలకు ఎంపీ రాములు, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, సహకార సంఘం మహబూబ్‌నగర్ జిల్లా చైర్మన్ వెంకటయ్య, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకటేశ్, ఎంపీపీ నిర్మల ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని చెప్పారు. ఉమ్మడి మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సింగిల్ విండో డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని ఆయన కోరారు.



మాట్లాడుతున్న కేశవరెడ్డి

ఆరోపణలను ఖండిస్తున్నాం..

బీఆర్ఎస్ కౌన్సిలర్ల ప్రెస్‌మీట్

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం చైర్‌పర్సన్ చెవుల స్వప్న పురపాలక సంఘం పరిధిలో అవినీతి, అక్రమ వసూళ్ల పాల్పడుతుందని పేర్కొన్నారు. తామంతా అడ్డుకుంటున్నందుకే తమపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని పెద్దఅంబర్‌పేట పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు, కౌన్సిలర్ సిద్దంకి కృష్ణారెడ్డి, వడ్డేపల్లి విద్యావతి, చెవుల హరిశంకర్, పాశం అర్చన, కోటేశ్వర్‌రావు, పరుశురాం, రోహిణీరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ భూముల విషయంలో మంగళవారం చైర్‌పర్సన్ స్వప్న చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు. బుధవారం వారు మాట్లాడారు. ప్రభుత్వ భూములను కబ్జా చేయాల్సిన అవసరం తమకు లేదని అన్నారు.

మజీద్‌పూర్‌లో కంటివెలుగు శిబిరం

అబ్దుల్లాపూర్‌మెట్: మండలంలోని మజీద్‌పూర్ గ్రామంలో బుధవారం కంటివెలుగు శిబిరాన్ని గ్రామ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సర్పంచ్ సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు ఉపసర్పంచ్ బాలకిషన్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి జమీల్, వార్డుసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం..

కడ్తాల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమం దేశానికే ఆదర్శమని ఆమనగల్లు జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ అన్నారు. బుధవారం ఆమనగల్లు మండల పరిధిలోని రాంనుంతల గ్రామ పంచాయతీ కార్యాలయంలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ సోనాశ్రీను నాయక్, ఎంపీటీసీ సరితా పంతునాయక్‌తో కలిసి జెడ్పీటీసీ పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు.. తిరుపతిరెడ్డి, మంగ్యానాయక్, శ్రీనునాయక్, రూప్‌సింగ్, మల్యా, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

చీపునుంతల్లో..

తలకొండపల్లి: ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని సర్పంచ్ బండి రఘుపతి అన్నారు. బుధవారం మండలంలోని చీపునుంతల్లో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ లక్ష్మీదేవి, వార్డు సభ్యులు మల్లేశ్, బాలకుమార్, శేఖర్, శ్రీశైలం, కార్యదర్శి యాదగిరి, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

‘ఉపాధి’ని సద్వినియోగం చేసుకోవాలి

ఎంపీపీ కృపేశ్

ఇబ్రహీంపట్నం రూరల్: ఉపాధి హామీ పనులను ప్రతి కూలీ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కృపేశ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పోచారం గ్రామంలో ఉపాధి హామీ పనులను ఆయన ప్రారంభించారు . ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. వేసవిలో ప్రతి గ్రామంలో కూలీలకు ఉపాధి పని కల్పించాలన్నారు. అధికారులు కూలీలకు సకాలంలో డబ్బులు చెల్లించాలన్నారు. పనిచేసిన వారం రోజుల్లో ఖాతాల్లో నగదు జమ అయ్యే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో పర్యటించి కూలీలకు వసతులు కల్పించాలని ఆదేశించారు.

ఉపాధి పనుల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలి

కడ్తాల్: ఉపాధిహామీ పథకం కింద చేపడుతున్న పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని మాడ్గుల్ ఎంపీడీఓ రాఘవులు సూచించారు. మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఉపాధికూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పని ప్రదేశంలో తగిన వసతులు కల్పించాలని ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. అనంతరం ఎంపీడీఓ రాఘవులు మండల పరిధిలోని అందుగులలో పర్యటించి అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. గ్రామంలో చేపట్టాల్సిన వివిధ పనులపై గ్రామ పంచాయతీ అధికారులకు పలు సూచనలు చేశారు. సర్పంచ్ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం రూరల్: ఉపాధి పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ కృపేశ్

న్యాయం చేయాలంటూ మృతదేహంతో ధర్నా



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీసీపీ, ఏసీపీ

- హత్యకు సహకరించిన వారిపై చర్యలు తీసుకోవాలి
- స్థానిక పోలీసుల వైఫల్యంతోనే హత్య

కొత్తూరు: ఈ నెల 16న హత్యకు గురైన మండలంలోని మల్లాపూర్‌కు చెందిన డాక్యుమెంట్ రైటర్ మామిడి కరుణాకర్‌రెడ్డి అంత్యక్రియలు బుధవారం ముగిశాయి. అంతకు ముందు పోస్టుమార్టం అనంతరం ఉస్మానియా ఆస్పత్రి నుంచి మృతదేహాన్ని గ్రామానికి తీసుకు వస్తుండగా కుటుంబసభ్యులు అంబులెన్స్‌ను గ్రామ సమీపంలో అడ్డుకుని ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి, షాద్‌నగర్ ఏసీపీ కుషాల్కర్ అక్కడి రాగా బాధితులు వారి ఎదుట తమ గోడును వెల్లబోసుకున్నారు. హత్యకు పాల్పడిన నిందితులను అరెస్ట్, రిమాండ్‌తో సరిపెట్టకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితులతో పాటు హత్యలో మరి కొంతమంది ప్రమేయం ఉందని.. వారిని కూడా శిక్షించాలని కోరారు. కొత్తూరు ఇన్‌స్పెక్టర్ వైఫల్యం కారణంగానే హత్య జరిగిందని ఆయనపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. నిందితుల కారణంగా ఎవరైనా ఇబ్బందులు పడితే తమ దృష్టికి తీసుకురావాలని డీసీపీ, ఏసీపీలు కోరారు. నిందితులపై పీడీయాక్ట్, రౌడీషీట్ ప్రయోగించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.



విలపిస్తున్న కుటుంబసభ్యులు

క్లుప్తంగా

దాతల సహకారం అభినందనీయం

సర్పంచ్ గోపాల్



పలకలు పంపిణీ చేస్తున్న సర్పంచ్, తదితరులు

చేవెళ్ల: పేద పిల్లల విద్యాభివృద్ధికి దాతలు అందించే సహకారం మరువలేనిదని సర్పంచ్ గోపాల్ అన్నారు. శంకర్‌పల్లి మండలంలోని టంగటూరులో బుధవారం అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు దాత జీఎస్ఎన్ ఫౌండేషన్ ఎన్.రవి సహకారంతో పలకలను సర్పంచ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన గ్రామం మన పిల్లలు అని ప్రతి ఒక్కరూ ఆలోచిస్తే గ్రామం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. చదువుకునే పిల్లలను ప్రోత్సహిస్తే వారు గ్రామాభివృద్ధికి సహకరిస్తారన్నారు. దాత రవి పలకలు అందించడం అభినందనీయమని చెప్పారు కార్యక్రమంలో ఉప సర్పంచ్ మంగమ్మ , జీఎస్ఎన్ ఫౌండేషన్ సభ్యులు దయాకర్, కృష్ణ, మహేందర్, అంగన్‌వాడీ టీచర్, చిన్నారులు తదితరులు ఉన్నారు.

అంధత్వ నివారణే లక్ష్యం

సర్పంచ్ శ్రీనివాస్ ముదిరాజ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న సర్పంచ్

మొయినాబాద్‌రూరల్: ఆరోగ్య తెలంగాణ సాధనే లక్ష్యంగా ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తోల్‌కట్ట సర్పంచ్ శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. బుధవారం మండలంలోని తోల్‌కట్టలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. కంటి వెలుగు కార్యక్రమం దేశంలోనే ఆదర్శమని అన్నారు. ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అలాగే, సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడ లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, నర్సులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ మహేష్‌బాబు

కొందుర్గు: ఉపాధి హామీ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీడీఓ మహేష్‌బాబు సూచించారు. బుధవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని వీరన్నపేటలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఎంపీడీఓ పరిశీలించారు. కూలీల హాజరుకు సంబంధించిన మస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కూలీలు తమకు నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు నిర్వహిస్తే రోజుకు కేటాయించిన కూలిరేటు లభిస్తుందన్నారు. వేసవి తాపం నుంచి తట్టుకునేందుకు సాధ్యమైనంత వరకు ఉదయం వేళల్లో పనులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీఏ వినోద్, కూలీలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఇఫ్తార్

నాయకుడు సత్యం



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

శంకర్‌పల్లి: రంజాన్ మాసం ఎంతో పవిత్రమైంది. ముస్లింలు నియమ, నిష్టలతో ఉపవాస దీక్షలు చేస్తారని మోకిల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గౌండ్ర సత్యం పేర్కొన్నారు. బుధవారం మోకిలలోని ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండుగలు మతసామరస్యానికి ప్రతీకలని అన్నారు. ప్రతి ఒక్కరూ ఐకమత్యంగా ఉండాలన్నారు. పండుగల శాంతియుత వాతావరణం జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులతో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

హయత్‌నగర్: ఎన్ని అడ్డంకులు ఎదురైనా మున్సిపాలిటీని అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న అన్నారు. బుధవారం 3వ వార్డు(కళానగర్)లో రూ.5 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. కళానగర్ అభివృద్ధిలో వెనుబడి ఉందని.. అధికంగా నిధులు కేటాయించి ఇక్కడి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు.